## బీ ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీ ఫార్మసీ కోర్సు పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్ సైట్ www.osmania. ac.in లో చూసుకోవాలని సూచించారు.

## నేడు బంగారు మైసమ్మ కల్యాణం

సికింద్రాబాద్, ఏప్రిల్ 22: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కాలనీలో బంగారు మైసమ్మ ఆలయంలో నేడు కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్ గౌడ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో బుధవారం ఉదయం చండీహోమం, అమ్మవారి కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హర్యానా గవర్నర్ బండారు దాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొంటారని పవన్ కుమార్‌గౌడ్ తెలిపారు.

## వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలి

బేగంపేట్, ఏప్రిల్ 22: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈ నెల 14 వరకు స్వీకరించిన విషయం తెలిసిందే. అయితే సికింద్రాబాద్ మండల పరిధిలో 7 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయని సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్ తెలిపారు. దరఖాస్తు కాపీలను ఆయా మున్సిపల్ పరిధిలోని వార్డ్ కార్యాలయాల్లో ఫిజికల్‌గా ఇవ్వాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 లోపల పత్రాలు వార్డ్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న అధికారులకు అందజేయాలని సూచించారు.

# బీఆర్ఎస్ సభకు భారీగా తరలివెళ్లాలి

● చరిత్రలో నిలిచిపోయే రజతోత్సవ సభ: ఎమ్మెల్యేలు తలసాని, ముఠా గోపాల్



చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 22: ఈ నెల 27వ తేదీన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరగబోయే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభా ప్రాంగణాన్ని మంగళవారం మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్,ఎమ్మెల్యే ముఠాగోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. చరిత్రలో రజతోత్సవ సభ నిలిచిపోనుందని వారు పేర్కొన్నారు. సభ పండుగ వాతావరణంలో జరుగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### సభను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బౌద్ధ నగర్ కార్పొరేటర్ కంది శైలజ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో నిర్వహించనున్న సభకు గులాబీ శ్రేణులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సభను విజయవంతం చేసేందుకు బౌద్ధ నగర్ వార్డు కార్యాలయంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కంది శైలజ మాట్లాడుతూ 27న హభ నిర్వహించబోయే రోజు ఉదయం 11 గంటలకు డివిజన్ పరిధిలో జెండా ఎగురవేసి సభకు బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బీఆర్ఎస్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ రాజుసుందర్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్

### రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ

బేగంపేట్: ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలి వెళ్లాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద పద్మారావునగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన చలో వరంగల్ పోస్టర్ ను ఎమ్మెల్యే తలసాని ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులతో కలిసి భారీగా వాహనాల్లో ఎల్కతుర్తి సభ ఏర్పాట్ల పరిశీలన కోసం తరలివెళ్లారు.

### రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది

ముషీరాబాద్: బీఆర్ఎస్ నిర్వహించనున్న రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. మంగళవారం తెలంగాణ జాగృతి నగర నాయకుడు పరకాల మనోజ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, వాల్ రైటింగ్ కార్యక్రమంలో జయసింహ పాల్గొని బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్ నిలుస్తుందని, 65 లక్షల మంది కార్యకర్తల బలమున్న తమ పార్టీకి ఎదురు లేదని అన్నారు. 1200 ఎకరాల్లో నిర్వహించే బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, శివముదిరాజ్, టెంట్ హౌస్ శ్రీనివాస్, వై.శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్ చిట్టి, శోభ తదితరులు పాల్గొన్నారు.

### రజతోత్సవ సభకు తరలి రావాలి

చిక్కడపల్లి: రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలి రావాలని బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్ అన్నారు. మంగళవారం డివిజన్ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ నుంచి ప్రతి బస్తీకాలనీ నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు తరలి రావాలని కోరారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో డివిజన్ పరిశీలకులు మాధవ్, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జయదేవ్, ముదిగొండ మురళి, కళ్యాణ్‌నాయక్, సిరిగిరి కిరణ్, రమేష్‌రెడ్డి టెంపుల్ జనార్దన్, శివకుమార్‌యాదవ్, సత్యనారాయణ, టీవీ రాజు, శ్రీనివాస్, ప్రవీణ్, మోజెస్, గండు వెంకటేష్, రాజు, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ, పార్టీ శ్రేణులు



బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న ముఠా జయసింహ

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



నాలుగో వార్డులో వాల్ పోస్టర్ వేస్తున్న బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, మాజీ బోర్డు సభ్యులురాలు నళిని, బీఆర్ఎస్ నాయకులు

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 22: వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో ఈ నెల 27న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ అన్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే, కంటోన్మెంట్ ఇంచార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు కంటోన్మెంట్ మూడు, నాలుగోవ వార్డు మాజీ బోర్డు సభ్యురాలు అనితా ప్రభాకర్, నళిని కిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎల్కతుర్తి సభ రికార్డు సృష్టిస్తుందని, దేశంలోనే అతి పెద్ద సభ బీఆర్ఎస్ పార్టీ సభ అని అన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పార్టీ జెండా గద్దెల నిర్మాణం, పోస్టర్ల ఆవిష్కరణ, గోడల పై రాతలు ,జెండా ఆవిష్కరణ కార్యాక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు బీజి బీజి గా ఉన్నారని అన్నారు. పార్టీ ఆవిర్భవించి 25వ సంవత్సరాల్లో అడుగుపెడుతున్న సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం మాజీ బోర్డు సభ్యులతో కలిసి అధిక సంఖ్యలో జనాలను సమీకరించి జయప్రదం చేస్తామని తెలిపారు. సభకు వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి కోసం ప్రత్యేక వాటర్ ప్యాకెట్లు, బట్టర్ మిల్క్, ఆహార పదార్థాలు అందిస్తామన్నారు. ఈ సభను తెలంగాణ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరితో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ బోర్డు సభ్యురాలులతో కలిసి గజ్జెల నాగేష్ వరంగల్ గోడ ప్రతికను ఆవిష్కరించి గోడలకు అంతికించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, సంతోష్, భాస్కర్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

## ఉద్యమంలా బీఆర్ఎస్ నేతల వాల్ రైటింగ్




కంటోన్‌మెంట్‌లో రజతోత్సవ సభ సక్సెస్ కోసం గోడలపై వాల్ రైటింగ్

కంటోన్మెంట్, ఏప్రిల్ 22: ఉమ్మడి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా బీఆర్ఎస్ నేతలు వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని కంటోన్మెంట్ నియోజకవర్గంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేష్‌తో పాటు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ఉద్యమంలా కొనసాగిస్తున్నారు. నియోజవర్గంలోని పికెట్, మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, బాలంరాయి, బొల్లారం ప్రాంతాల్లోని గోడలపై వాల్ రైటింగ్ చేస్తూ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నారు.

## మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులదే బాధ్యత



టీటీఐలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

బేగంపేట్, ఏప్రిల్ 22: మైనర్ డ్రైవింగ్ చట్ట ప్రకారం నేరం.. మైనర్లు వాహనాలు నడిపితే అందుకు తల్లిదండ్రులు బాధ్యులవుతారని ఉత్తర మండలం ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాలు- నివారణపై ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు వచ్చిన ట్రాఫిక్ ఉల్లంఘనదారుల తల్లిదండ్రులకు రెండు రోజులుగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ వాహనదారుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అన్నారు. మైనర్ల డ్రైవింగ్ కేసుల్లో తల్లిదండ్రుల వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు సస్పెండ్ అయ్యే అవకాశం ఉందన్నారు. అన్ని విధాల వాహన డాక్యుమెంట్ ఉండాలని అర్హులైన వారే వాహనాలను ట్రాఫిక్ ఉల్లంఘనలు లేకుండా నడపాలని సూచించారు. ఈ కాక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు, టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, అశోక్, సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

## అలరించిన నిర్విరామ సంగీత విభావరి




కావ్యరెడ్డిని సత్కరిస్తున్న సినీ నటుడు సుమన్, వంశీరామరాజు

ముషీరాబాద్, ఏప్రిల్ 22: కావ్యరెడ్డి మ్యూజికల్ వరల్డ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో నిర్వహించిన 12 గంటల నిర్విరామ సంగీత విభావరి పలువురిని అలరించింది. గాయని కావ్యరెడ్డి 12 గంటల పాటు నిర్విరామంగా 108 పాటలు పాడి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ సొంత చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సినీ నటుడు సుమన్, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డును కావ్యరెడ్డికి అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బింగి నరేంద్ర గౌడ్, రమేష్, సైదారెడ్డి, విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకలో పర్యటించిన జలమండలి ఈడీ



సిటీబ్యూరో, ఏప్రిల్22 (నమస్తే తెలంగాణ): జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-7 పరిధిలోని తార్నాకలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ మంగళవారం పర్యటించారు. డివిజన్ పరిధిలో వాటర్ సప్లయ్, సీవరేజ్, రెవెన్యూ బిల్లింగ్, కలెక్షన్, ఎంసీసీ ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎం వినోద్ కుమార్, డీజీఎం ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సంజయ్ కిశోర్‌కు సత్కారం



సంజయ్‌ను సత్కరిస్తున్న సాహితీ వేత్త ఓలేటి పార్వతీశం

ముషీరాబాద్, ఏప్రిల్ 22: కృషికి ప్రతిభకు ఎప్పటికైనా తప్పక గుర్తింపు లభిస్తుంది అని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ అభినందన నిర్వహణ లో సినీ పరిశోధకుడు, రచయిత సంజయ్ కిషోర్ కు చిక్కడపల్లి లో సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వోలేటి పార్వతీశం సంజయ్ ను సంస్థ పక్షాన సత్కరించి మాట్లాడారు సాంస్కృతిక సంస్థలు పుట్ట గొడుగులు గా విస్తరిస్తున్న సందర్భం లో సామాజిక చింత, సాంస్కృతిక తపన పడే సంస్థలలో సంగమం అభినందన తొలి స్థానం లో వుంటాయి అన్నారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ శోభా పెరిందేవి తదితరులు పాల్గొన్నారు.

## ధరిత్రిని కాపాడడంలో విద్యార్థుల పాత్ర కీలకం



పిన్సిపాల్‌ను అభినందిస్తున్న ప్రతినిధులు

అమీర్‌పేట్, ఏప్రిల్ 22: ధరిత్రిని కాపాడడంలో విద్యార్థుల పాత్ర కీలకమని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ పర్యావరణ శాస్త్రవేత్త డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట్‌లోని సిస్టర్ నివేదిత స్కూల్లో 'మన శక్తి.. మన గ్రహం' అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ప్రసన్నకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మొక్కలు నాటడం వల్ల జరిగే కాలుష్య నియంత్రణ, మొక్కలను గుర్తుచేసే దుస్తులు ధరించిన చిన్నారుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం చిన్నారులు పాడిన పాటలు కార్యక్రమానికి విచ్చేసిన వారిని ఆలోచింపజేశాయి. సీనియర్ పర్యావరణ శాస్త్రవేత డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కార్యక్రమంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఫ్యాకల్టీ డాక్టర్ సుమలిని, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ ధర్మేంద్రరావు, పాఠశాల ప్రిన్సిపాల్ లలితకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ వేడుకలు



అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 22: బోలక్‌పూర్ లోని కృష్ణానగర్ 2 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ పి.సావిత్రి మాట్లాడుతూ ఏడాది పాటు విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్య అందించామని అన్నారు. మంచి అలవాట్లు, క్రమశిక్షణ, విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత పెంపొందించడం, ప్రతిరోజు వారికి ఆటలు, పాటలు నిర్వహించామని తెలిపారు. వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు స్టార్ అవార్డులను అందించామని తెలిపారు. చుట్టుపక్కల బస్తీల్లో ఉన్న తల్లిదండ్రులు రెండున్నర ఏండ్లు నిండిన చిన్నారులను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఆమె కోరారు. ప్రతీ ఇంట్లో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని, మార్కెట్‌కు వెళితే.. బట్ట సంచి వెంట తీసుకెళ్లాలని ఆమె తల్లిదండ్రులను కోరారు.

## సుందర్‌నగర్ కాలనీ అధ్యక్షుడిగా అమర్‌నాథ్



కాలనీ నూతన కార్యవర్గం

అమీర్‌పేట్, ఏప్రిల్ 22: సనతనగర్ సుందర్‌నగర్ రెసిడెంట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అమర్‌నాథ్ కంజర్ల ఎంపికయ్యారు. దాదాపు ఏకపక్షంగా సాగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా ఎ.రవి కుమార్, సంయుక్త కార్యదర్శిగా జి.విజయ్‌కుమార్, కోశాధికారిగా జీబీజీ తిలక్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా ఎస్.నరేంద్రరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన కాలనీవాసులతో కలిసి కాలనీ సంక్షేమానికి తన వంతు బాధ్యతలను నిరవర్తిస్తానన్నారు. తనపై నమ్మకంతో కాలనీవాసుల సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతిఒకరికి ధన్యవాదాలు తెలిపారు.

# సైబర్ వల.. చిక్కుకుంటే విలవిల!

● నానాటికీ పెరుగుతున్న సైబర్ మోసాలు
● మోసాలపై ఎప్పటికప్పుడు పోలీసుల అవగాహన కార్యక్రమాలు




కంటోన్మెంట్, ఏప్రిల్ 22: నార్త్ జోన్ పరిధిలోని ఓ వస్త్ర దుకాణం మేనేజర్ పార్ట్ టైం ఉద్యోగానికి సంబంధించి వచ్చిన ఆన్‌లైన్ లింక్‌పై క్లిక్ చేశారు. ముందుగా సైబర్ నేరగాళ్లు రూ.500 విలువైన వస్తువు అమ్మాలని సూచించారు. అలా రోజురోజుకీ కొంతమొత్తం పెంచుకుంటూ వెళ్లేవారు. వారం కిందట రూ.5లక్షల వస్తువు అమ్మాలని, ముందుగా తమ ఖాతాలో నగదు వేయాలని చెప్పారు. ఎప్పటిలాగే వస్తువులు అమ్మితే నగదు వచ్చేస్తుందనుకుని రూ.5 లక్షలు పంపించాడు. ఇప్పుడు అవతలి వ్యక్తుల సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో లబోదిబోమంటున్నారు.

– పికెట్‌కు చెందిన ఓ యువకుడు తన సెల్‌ఫోన్‌లో వచ్చిన ఆన్‌లైన్ లోన్ లింకుపై క్లిక్ చేశాడు. అడిగిన వివరాలన్నీ ఇవ్వడంతో వెంటనే అప్పు ఇచ్చారు. మొత్తం బాకీ తీర్చేసినా.. ఇంకా చెల్లించాలని డిమాండు చేస్తున్నారు. లేకపోతే కేసులు పెడతామని.. కరకాలుగా బెదిరింపులకు పాల్పడుతున్నారు.

– బోయిన్‌పల్లికి చెందిన ఓ గృహిణి నగరంలోని ఓ దుకాణంలో పని చేస్తోంది. అప్పు ఇస్తారని ఆన్‌లైన్‌లింక్ క్లిక్ చేసింది. ఇప్పుడు ఆ గృహిణిని ఇచ్చిన దాని కంటే రెట్టింపు డబ్బులివ్వాలని అడుగుతున్నారు. ఇవ్వకపోతే సామాజిక మాధ్యమాల్లో అల్లరి చేస్తామని బెదిరిస్తున్నారు. ఇలా నగరంలోని నార్త్ జోన్ పరిధిలో సైబర్ నేరాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో రెండు నుంచి మూడు వరకు కేసులు నమోదవుతున్నాయి. మోసగాళ్లు ఏ మాత్రం అవకాశం దొరికినా ఖాతాలు ఖాళీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అనేక రకాలుగా గాలాలు వేసి సామాన్యులను ఆర్థికంగా కుంగదీస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

### లింకులతోనే సమస్యలన్నీ..

ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ల వినియోగం ఆధికమైంది. వీటిని ఆసరాగా చేసుకున్న నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆన్‌లైన్ లింకుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. నగదును ఆశ చూపి, వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా యువతకు ఎర వేసి అప్పులిస్తామని చెప్పి ఆశ పెడుతున్నారు. వివరాలు తీసుకుని అడిగిన సొమ్ము ఆన్‌లైన్‌లో పంపించేస్తున్నారు. మొత్తం తిరిగి చెల్లించినా ఇంకా ఇవ్వాలని లేకపోతే వేధింపులకు దిగుతున్నారు. నగరంలో ఘటనలు ఎక్కువగానే జరుగుతున్నాయి. అందరూ పోలీసులను ఆశ్రయించడం లేదు. వీళ్లు చేసిన తప్పు ఇంట్లో తెలియకపోవడంతో ఎవరేమంటారోనని మిన్నకుండి పోతున్నారు. అపరిచిత వ్యక్తుల చేతుల్లో నష్టపోతున్నారు.

### వీటి జోలికి పోవద్దు..

మీ 'కేవైసీ అప్డేట్ చేయాలని ఫలానా యాప్‌ను డౌన్లోడ్ చేసుకోండి అని ఎవరైనా చెబితే అసలు నమ్మొద్దు. పొరపాటున చేస్తే ఆ యాప్ ద్వారా సైబర్ నేరగాళ్లు మీ బ్యాంక్ ఖాతాను క్షణాల్లో ఖాళీ చేస్తారు.

ఆన్‌లైన్‌లో వెంటనే అప్పులిస్తామని చెప్పే యాప్‌లకు దూరంగా ఉండండి. ఒకవేళ తీసుకుంటే తరువాత కొత్త సమస్యల్లో చిక్కుకోవాల్సి వస్తుంది.

– మీకు లాటరీ వచ్చింది. కొంతమొత్తం చెల్లిస్తే లాటరీలో వచ్చిన డబ్బులను ఇస్తామని చెబితే నమ్మకండి.

– మైక్రోఫైనాన్స్ ఆన్‌లైన్ ఋణాల యాప్‌లు డౌన్‌లోడ్ చేయకండి. మీరు తిరిగి లోన్ చెల్లించకపోతే మీకు, మీ స్నేహితులు, బంధువులకు బెదిరింపు కాల్స్, నోటీసులు రావొచ్చు.

ఆన్‌లైన్‌లో వస్తువులు కొనే విషయంలోనూ జాగ్రత్తగా ఉండండి. నమ్మకమైన యాప్‌లనే వినియోగించండి.

– మీ స్థలంలో ఫలానా కంపెనీకి చెందిన సెల్ టవర్ ఏర్పాటు చేస్తాం. నెలకు రూ.25 వేలు అద్దె చెల్లిస్తాం. పదేళ్లు అగ్రిమెంట్ చేసుకుంటే రూ.20 లక్షలు ఇస్తాం. ఇందుకు ముందుగా రిజిస్ట్రేషన్ కోసం రూ.లక్ష చెల్లించండి అని ఎవరైనా ఫోన్ చేస్తే అది మోసమని గ్రహించండి.

### యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు, యువత యాప్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అప్పులిస్తామని ఆశ చూపి సైబర్ నేరగాళ్లు ఎర వేస్తుంటారు. ఆ వలలో చిక్కుకుంటే ఆర్థికంగా నష్టపోతారు. లింకులను క్లిక్ చేయకూడదు. అలాచేస్తే కొన్నిసార్లు వ్యక్తిగత వివరాలు అపరిచిత వ్యక్తులకు తెలిసిపోతాయి. బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంటుంది. అప్పుడే ఎక్కువ మోసాలు జరుగుతాయి. ఎవరైనా మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి.

– వి.రామకృష్ణ, ఎస్‌హెచ్‌ఓ, కార్ఖానా